సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

సోమవారం । 20 । ఫిబ్రవరి । 2023



సేవాలాల్ అవతార పురుషుడు

గిరిజనుల ఆరాధ్యదైవం సంత్‌సేవాలాల్ అవతార పురుషుడు అని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు.

- 8లో▸



ఆలోచనల ఆవిష్కరణ

ఇంక్యుబేషన్ సెంటర్‌లా నూతన ఆవిష్కరణలకు, స్కిల్ డెవలప్‌మెంట్‌కు నిట్ సెంటర్ ఫర్ ఎక్సలెన్సీ భవనంలోని సీమెన్స్ సంస్థ తోడ్పాటు నందిస్తోంది.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
33.0^0 / 19.0^0

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉండడంతో పాటుగా పొగమంచు కమ్ముకుంటోంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

శివాజీ జయంతి వేడుకలు



భూపాలపల్లి అర్బన్‌: శివాజీ ఛత్రపతి మహారాజ్ 393వ జయంతి వేడుకలను జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆర్యక్షత్రియ సంఘం నాయకులు వేడుకలను ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దివ్యాంగుల సంస్థ చైర్మన్ వాసుదేవరెడ్డి, ఆర్యక్షత్రియ సంఘం జిల్లా అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ యూత్ నాయకులు మైనాల నరేష్, కౌన్సిలర్ శిరుప అనిల్, సంఘం నాయకులు మైనాల సురేష్ పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు



మల్హర్‌: నాచారం గ్రామంలో ప్రసిద్ధి గాంచిన మల్లన్న గుట్టలోని మల్లికార్జున స్వామిని మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. నాచారం మల్లన్న గుట్ట దేవాలయానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆన్‌సాన్‌పల్లి సర్పంచ్ జగన్‌నాయక్, ఎంపీటీసీ భూక్య స్వప్న రఘు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అయిత రాజిరెడ్డి, మండల అధ్యక్షుడు బడితెల రాజయ్య, మాజీ ఎంపీపీ రవి, అంబటి చంద్రమోహన్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీఆదిముక్తీశ్వర-శుభానంద కల్యాణం



కాళేశ్వరం: కాళేశ్వరం అడవిలో వెలిసిన శ్రీఆదిముక్తీశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి మరుసటి రోజున ఆనవాయితీ ప్రకారం ఆదివారం సాయంత్రం శుభానంద–ఆదిముక్తీశ్వర స్వామివార్ల కల్యాణం వైభవంగా శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పూర్ణాహుతితో ముగిసిన ఉత్సవాలు



కాళేశ్వరం: దక్షిణ కాశీగా పిలువబడే శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఆదివారం పూర్ణాహుతితో ముగిశాయి. శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు అంగరంగ వైభవోపేతంగా ఉత్సవాలను దేవస్థానం అధికారులు నిర్వహించారు. వేదపండితులు ప్రత్యేకపూజలతో యాగశాలలో పూర్ణాహుతి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి నాకబలి, నందివాహన పవళింపు సేవతో కార్యక్రమాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఈఓ మహేష్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.20లక్షల ఆదాయం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయానికి మూడు రోజుల్లో వివిధ పూజలు, లడ్డు ప్రసాదాల ద్వారా రూ.20లక్షల వరకు ఆదాయం సమకూరినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. మూడు రోజుల పాటు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు సుమారు 2లక్షల వరకు స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారుల అంచనా. దీంతో భారీగా ఆదాయం సమకూరింది.



ఆరోగ్య యోగం..

ఆయుర్వేద ఆస్పత్రుల్లో యోగా కేంద్రాలు

- జిల్లాకు 8 మంజూరు.. ఒక్కో కేంద్రానికి రూ.6లక్షలు..

భూపాలపల్లి అర్బన్‌: యోగా ప్రాముఖ్యతను గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రాల ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో యోగా కేంద్రాలు నిర్మించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాయి. నేషనల్ ఆయుష్ మిషన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో జిల్లాలోని ఆయుష్ డిస్పెన్సరీల్లో యోగాకేంద్రాలు నిర్మించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 421 యోగాకేంద్రాలను మంజూరు చేయగా అందులో జిల్లాకు ఎనిమిది కేంద్రాలు మంజూరుచేశారు. ఒక్కో కేంద్రానికి రూ.6లక్షల చొప్పున మొత్తం రూ.48 లక్షలను ఇప్పటికే మంజూరుచేయగా.. త్వరలో అందుబాటులోకి రానున్నాయి.

జిల్లాలోని 8 ఆయుష్ ఆస్పత్రుల్లో యోగా కేంద్రాలు మంజూరయ్యాయి. దామెరకుంట, వల్లెంకుంట, మహదేవపూర్, మహాముత్తారం, మొగుళ్లపల్లి, ధర్మారావుపేట, కోడవటంచ, చల్లగరిగెలకు ఆయుష్ వెల్‌నెస్ సెంటర్లకు మంజూరు చేశారు. ధర్మారావుపేట సెంటర్‌లో నిర్మాణపనులు పూర్తయ్యాయి. దామెరకుంట, మొగుళ్లపల్లి సెంటర్లలో పనులు చివరిదశకు చేరుకున్నాయి, మిగితా ఐదు సెంటర్లలో పనులు ఇంకా ప్రారంభం కాలేదు.

- నేషనల్ ఆయుష్ మిషన్ నిబంధనల ప్రకారం గాలి, వెలుతురు సోకే విధంగా 18ఫీట్ల వెడల్పు.. 21 ఫీట్ల పొడవులో నిర్మాణం ఉండే విధంగా అధికారులు డిజైన్ రూపకల్పన చేశారు.
- ప్రస్తుతం ప్రజలు వివిధ రకాల ఆహారపు అలవాట్లతో తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారన్న విషయాన్ని ధ్రువీకరించి పల్లెలు, పట్టణాల్లో యోగా కేంద్రాల నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్టు తెలుస్తోంది.
- జిల్లాలో నిర్మిస్తున్న యోగా కేంద్రాల్లో ప్రతీ కేంద్రానికి ఇద్దరు యోగా ఇన్‌స్ట్రక్టర్లను నియమించనున్నారు.
- యోగాను మరింత విస్తరించి ప్రజల ఆరోగ్యం దిశగా అడుగులు వేసేందుకు కృషి చేస్తున్నారు.

దీర్ఘకాలిక రోగాలకు చెక్..



ప్రతీ రోజు యోగా చేయడం ద్వారా దీర్ఘకాలిక రోగాలకు చెక్ పెట్టవచ్చు. జిల్లావ్యాప్తంగా ఎనిమిది యోగా కేంద్రాలు మంజూరయ్యాయి. అందులో ఒక షెడ్డు నిర్మాణం పూర్తికాగా రెండు షెడ్ల నిర్మాణాలు చివరిదశకు చేరుకున్నాయి. మరో ఐదు చోట్ల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం.

– రవినాయక్, ఆయుష్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్

23న మంత్రి కేటీఆర్ రాక

- అభివృద్ధి పనుల ప్రారంభం, శంకుస్థాపనలు
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



భూపాలపల్లి: జిల్లాకేంద్రానికి ఈ నెల 23న(గురువారం) రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు రానున్నారు. భూపాలపల్లి పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించి పలు నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నారు. గణపురం మండలకేంద్రంలోని నూతన తహసీల్దార్ కార్యాలయం, అదే మండలంలోని గాంధీనగర్‌లో నిర్మించిన మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను ప్రారంభించనున్నారు. అక్కడి నుంచి మంజూర్‌నగర్‌కు చేరుకొని సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో కార్మికుల సౌకర్యార్థం రూ.210కోట్లతో నిర్మించిన 900 క్వార్టర్లను ప్రారంభించనున్నారు. అనంతరం భూపాలపల్లి పట్టణంలోని భాస్కరగడ్డలో పేదల కోసం నిర్మించిన 994 డబుల్ బెడ్ రూం ఇళ్లు, సుభాష్‌కాలనీలో మున్సిపాలిటీ మినీ స్టేడియాన్ని ప్రారంభిస్తారు. పోలీస్‌స్టేషన్ ఎదురుగా సింగరేణి స్థలంలో జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. నూతనంగా నిర్మించిన కూరగాయల మార్కెట్ సుముదాయం, వీధి వ్యాపారుల కోసం నిర్మించిన స్ట్రీట్ వెండర్ మార్కెట్‌ను ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు భూపాలపల్లి పట్టణంలోని అంబేడ్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి కేటీఆర్ ప్రసంగించనున్నారు.

భారీ బందోబస్తు..

రాష్ట్ర ఏర్పాటు తర్వాత కేటీఆర్ భూపాలపల్లి పట్టణానికి వస్తున్న నేపథ్యంలో బహిరంగ సభను సక్సెస్ చేసే పనుల్లో బీఆర్ఎస్ శ్రేణులు నిమగ్నమయ్యాయి. ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ఆదేశాలు, సూచనల మేరకు ఆ పార్టీ నాయకులు గ్రామ, మండల, జిల్లాస్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి సుమారు పదివేల మంది జన సమీకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. బహిరంగ సభకు మంత్రి కేటీఆర్‌తో పాటు ఐదారుగురు మంత్రులు హాజరు కానున్నట్లు సమాచారం. దీంతో పోలీసులు భారీ బందోబస్తు చర్యలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. పది మంది డీఎస్పీలు, 15మంది సీఐలు, 40మంది ఎస్సైలతో పాటు గణపురంలో 200 మంది, భూపాలపల్లిలో 600 పోలీసులు సిబ్బంది విధులు నిర్వర్తించనున్నట్లు తెలిసింది.

కేటీఆర్ సభను విజయవంతం చేయాలి



నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భూపాలపల్లి రూరల్‌: ఈనెల 23న భూపాలపల్లి పట్టణంలో మంత్రి కేటీఆర్ సభను పార్టీ కార్యకర్తలు విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం భూపాలపల్లి పట్టణంలోని 8 వార్డు కౌన్సిలర్ నూనె రాజు ఆధ్వర్యంలో కార్యకర్తలతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ ప్రతీ వార్డునుంచి సుమారుగా 500మందికి పైగా సభకు తరలించాలని కౌన్సిలర్‌తోపాటు వార్డు సభ్యులకు సూచించారు. ఈ సమావేశంలో వార్డు అధ్యక్షుడు దేవేందర్, పార్టీ నాయకులు బుర్ర కుమారస్వామి, పైడిపల్లి రమేష్, కమిటీ సభ్యులు మంజాల రవీందర్‌గౌడ్, తాటి అశోక్‌గౌడ్, టీబీ చారి, బైరెడ్డి లక్ష్మారెడ్డి, ఎండీ ఖరీం పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు పెద్దపీట



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర



రైతువేదికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి
- అటవీ గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

భూపాలపల్లి రూరల్‌: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. గ్రామాల్లో పూర్తిస్థాయిలో సీసీరోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి రూపకల్పన చేస్తున్నట్లు చెప్పారు. ఆదివారం భూపాలపల్లి మండలంలోని అటవీ గ్రామాలైన దూదేకులపల్లి, లంబాడీతండా, గొల్లబుద్దారం, గొల్లబుద్దారంతండా, అముదాలపల్లి, కమలాపూర్, నాగారం, ఆజాంనగర్ గ్రామాల్లో రూ.2కోట్ల 7లక్షల నిధులతో సీసీరోడ్లు, డ్రెయినేజీలు, గ్రామపంచాయతీల భవనాల పనులకు శంకుస్థాపన చేశారు. దీక్షకుంట గ్రామంలో నిర్మించిన రైతు వేదికను ప్రారంభించారు. గొల్లబుద్దారం తండా, అముదాలపల్లి గ్రామ పంచాయతీ భవనాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న రైతుబంధు, రైతుబీమా, ఉచిత్ విద్యుత్ గురించి వివరించారు. నియోజకవర్గంలో ప్రజల సమస్యలను పరిష్కరించే విధంగా ముందుకెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ కళ్లెపు శోభ రఘుపతిరావు, ఎంపీపీ మందల లావణ్య విద్యాసాగర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, మండల వ్యవసాయశాఖ అధికారి సతీష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అవినీతి పాలన



సమావేశంలో మాట్లాడుతున్న సత్యపాల్‌రెడ్డి

టేకుమట్ల: రాష్ట్రంలో అవినీతి పాలన కొనసాగుతుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు చందుపట్ల సత్యపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం రేగొండ మండలంలోని రంగయ్యపల్లి శక్తి కేంద్రంలో ప్రజాగోస బీజేపీ యాత్రలో భాగంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరుతో వేల కోట్ల రూపాయలు మాయం చేశారని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించారని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఎన్నో నిధులను కేటాయిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ అవినీతి పాలనపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. రైతుల రుణాలను భేషరతుగా మాఫీ చేసి.. 24 గంటల విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రజలు అవినీతి పాలనకు చరమగీతం పాడడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెన్నంపల్లి పాపన్న, జిల్లా ఉపాధ్యక్షుడు లింగంపెల్లి ప్రసాద్ రావు, ప్రధాన కార్యదర్శి ఏడునూతుల నిశీధర్‌రెడ్డి, సరోత్తంరెడ్డి, బింగి శ్రీనివాస్, రాంరెడ్డి, సాంబరెడ్డి, నాగరాజు, శ్రీమాన్, దాసరి అనిల్ పాల్గొన్నారు.

ఐటీడీఏలో హక్కులు కల్పించాలి



మాట్లాడుతున్న దుర్గం చిన్నయ్య

భూపాలపల్లి అర్బన్‌: గోదావరి పరివాహక ప్రాంతం వెంట జీవిస్తున్న నేతకాని కులస్తులకు ఐటీడీఏలో హక్కులు కల్పించాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, నేతకానిహక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ ప్రభుత్వాన్ని కోరారు. భూపాలపల్లి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి నివాసగృహంలో ఆదివారం ఎమ్మెల్యే చిన్నయ్య విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అడవుల్లో నివసిస్తున్న ఆదివాసీ గూడేలకు ఆనుకొని నేతకాని కులస్తులు వారితో కలిసి జీవిస్తున్నారని తెలిపారు. 30, 40 సంవత్సరాలుగా అడవిని పోడుచేసుకొని వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో పంపిణీ చేయనున్న పోడు పట్టాల్లో తమ కులస్తులకు అవకాశం కల్పించాలని కోరారు. పలు డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుపోతున్నట్లు చెప్పారు. నేతకాని కులస్తులకు ప్రత్యేక గుర్తింపు వచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు పోక్కూరి చిన్న రాజయ్య, పోషయ్య, బాలరాజు, శ్యామ్, రాజమల్లయ్య పాల్గొన్నారు.

లింగోద్భవ పూజ.. భక్తుల ఆగ్రహం

- రోప్ పార్టీ పోలీసుల సాయంతో ఎస్పీ పూజకు..
- గందరగోళంగా మారిన ఈఓ తీరు



అనివెట్టి మండపం వద్ద కూర్చున్న భక్తులు



ప్రధాన ఆలయంలోకి పూజకు వెళ్లేందుకు గుమిగూడిన భక్తజనం

కాళేశ్వరం: కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా శనివారం రాత్రి 12గంటలకు నిర్వహించాల్సిన లింగోద్భవ పూజ సమయంలో దేవాదాయశాఖ ఈఓ తీరుపై భక్తులు ఆగ్రహం వ్యక్తంచేశారు. లింగోద్భవ పూజ కోసం (కాలుడు–యముడు) రెండు లింగాలపైన బిల్వదళాలు వేసి మొక్కులు చెల్లించాలని భక్తులు శనివారం అర్ధరాత్రి ఆలయానికి చేరుకున్నారు. అప్పటికే 10.30గంటల వరకు దర్శనాలు నిలిపిన దేవస్థానం అధికారులు ఆలయంలోకి ఎవరూ వెళ్లకుండా తాళాలు వేసి వెళ్లిపోయారు. దీంతో భక్తులు ఆగ్రహం వ్యక్తంచేశారు. అనివెట్టి మండపం అంతా భక్తులతో నిండిపోయి కిక్కిరిసింది. ఆనవాయితీ ప్రకారం ప్రతి సంవత్సరం లింగోద్భవ సమయంలో ప్రధాన ఆలయంలో ప్రజాప్రతినిధులు, వీవీపీలు, ఉన్నతాధికారులను అనుమతించేవారు. కానీ ఈసారి ఈఓ మహేష్ కొత్త కార్యక్రమానికి తెరలేపారని భక్తులు అసంతృప్తి వ్యక్తంచేశారు. అక్కడికి చేరుకున్న ఎంపీపీ రాణిబాయి దంపతులు, పీఏసీఎస్ చైర్మన్ చల్లా తిరుపతిరెడ్డి దంపతులు, జెడ్పీటీసీ రఘువరణ్, ఎంపీడీఓ శంకర్, తహసీల్దార్ శంకర్, బీఆర్ఎస్ పలిమెల మండల అధ్యక్షుడు జవ్వాజీ తిరుపతి కూడా గంటన్నర పాటు ఈఓ కోసం నిరీక్షించారు. సెల్‌ఫోన్ స్విచ్‌ఆఫ్ చేయడంతో అధికారులు ఆయనకు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఈఓపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఎంపీపీ తెలిపారు. 11.30గంటలకు కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి దంపతులు పూజకు వచ్చి వేచి చూడాల్సి వచ్చింది. 11.52గంటలకు ఆలయ ఉద్యోగులు వచ్చి ఒక్కసారిగా గేటు తాళాలు తీయడంతో భక్తులు లోపలికి వెళ్లేందుకు ఎగబడ్డారు. కొంత మంది వెళ్లగా.. మరికొంత మంది బయట ఆగ్రహంతో 'ఓం నమఃశివాయ' అంటూ స్మరించారు. సీఐ కిరణ్, ఎస్సైలు లక్ష్మణ్‌రావు, రాజ్‌కుమార్ ఇతర పోలీసు అధికారులు భక్తులను నిలువరించినా లోపలికి వెళ్లేందుకు పైపైకి దొచ్చుకుపోయారు. ఎస్పీ సురేందర్‌రెడ్డి దంపతులు పూజకు చేరుకోవడంతో పోలీసులు వెళ్లడానికి కూడా వీలు లేకుండా భక్తులంతా అడ్డుగా ఉండడంతో రోప్‌పార్టీ సాయంతో ఎస్పీ, డీఎస్పీ ఇతర వీఐపీలు అతి కష్టం మీద ఆలయంలోకి వెళ్లి పూజలు నిర్వహించారు. ఇంత హంగామా జరుగుతున్నా దేవస్థానం అధికారులు ఉత్సవ విగ్రహాల్లాగా వీక్షించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. గందరగోళం నడుమ లింగోద్భవ పూజలను అర్చకులు నిర్వహించారు. ఈ విషయమై ఈఓ మహేష్‌ను సంప్రదించగా.. గత సంవత్సరం కొంతమంది లోపల, కొంతమంది బయట ఉండడంతో నిరుత్సాహ పడ్డారు. ఈసారి అలా కాకుండా అందిరినీ వీఐపీలతో పాటు సాధారణ భక్తులను సమానంగా చూడాలనే ఉద్దేశంతో ఎవ్వరినీ అనుమతించలేదు. సెల్‌ఫోన్ స్విచ్‌ఆఫ్ చేయలేదు. సిగ్నల్స్ సరిగ్గా లేవని బదులిచ్చారు.

- వివరాలు 10లో▸

సేవాలాల్ మహరాజ్ జీవితం ఆదర్శం

- మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

కాటారం: లంబాడీల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు అన్నారు. కాటారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఆదివారం గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజ్మీర శ్రీకాంత్‌నాయక్ ఆధ్వర్యంలో సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భోగ్ భండార్ జరిపి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సేవాలాల్ ఆశయ సాధన కోసం కృషిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంతకాని సమ్మయ్య, మహాముత్తారం, మల్హర్ జెడ్పీటీసీలు లింగమల్ల శారద, ఐత కోమల, మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు మహేశ్, రవీందర్‌రావు, జాడి మహేశ్వరి, సర్పంచ్‌లు రఘురాం, బంజార నాయకులు కిషన్‌నాయక్, రమేశ్, భోజ్యానాయక్, ప్రతాప్, రాము, జగన్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు ఘనస్వాగతం పలకాలి

- ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు జ్యోతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర

గణపురం: భూపాలపల్లి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి ఈ నెల 23న విచ్చేస్తున్న రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావుకు ఘన స్వాగతం పలుకడంతో పాటు బహిరంగ సభను విజయవంతం చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి పిలుపునిచ్చారు. గణపురం మండలకేంద్రంలో ఆదివారం రాత్రి పార్టీ మండల అధ్యక్షుడు పోలసాని లక్ష్మీనరసింహారావు అధ్యక్షతన ముఖ్యకార్యకర్తల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా గండ్ర దంపతులు మాట్లాడుతూ గణపురం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ప్రారంభోత్సవంతో పాటు గాంధీనగర్ గ్రామంలోని మహాత్మాగాంధీ జ్యోతి బా పూలే బాలికల గురుకుల పాఠశాలను ప్రారంభించనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వ్యక్తి ఆత్మహత్య


ప్రభాకరా చారీ

ఎల్కతుర్తి: అనారోగ్య సమస్యతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి పురుగులమందు తాగి ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై జక్కుల పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రానికి చెందిన కందుకూరి ప్రభాకరా చారీ (65) స్థానికంగా వెల్డింగ్ వర్క్ చేసుకుంటూ జీవిస్తుండేవాడు. ఆయన భార్య రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారికి వివాహాలు జరిగాయి. ప్రభాకర్ ఒంటరి జీవితం గడపలేక, అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూరాబాద్ మార్చురీకి తరలించినట్లు తెలిపారు.

అనారోగ్య కారణాలతో..


కుమారస్వామి (ఫైల్)

కమలాపూర్: హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని గూడూరుకు చెందిన బండి కుమారస్వామి (48) అనారోగ్య కారణాలతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ బొలిమల్ల సంజీవ్ తెలిపారు. వ్యవసాయం చేసుకుని జీవనం సాగించే కుమారస్వామికి వివాహం కాలేదని, గత ఐదేళ్లుగా బీపీ, షుగర్, అల్సర్, కడుపు నొప్పితో బాధపడుతున్నాడని, అప్పుడప్పుడు కడుపులో విపరీతమైన మంట, నొప్పి వస్తున్నాయని బంధువులకు చెప్పుకుని ఏడ్చేవాడని తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో కుమారస్వామిని పలుకరిద్దామని ఆయన సోదరుడి కుమారుడు వినయ్‌సాగర్ వెళ్లగా ఇంటి తలుపులు మూసి ఉన్నాయని, ఎంత పిలిచినా తలుపులు తెరువకపోయే సరికి కిటికీలోంచి చూడగా సీలింగ్ ఫ్యాన్ బిగించే ఇనుప రింగ్‌కు తాడుతో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడని తెలిపారు. కుమారస్వామి బీపీ, షుగర్, అల్సర్, కడుపు నొప్పితో బాధపడుతూ తీవ్ర మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందాడని వినయ్‌సాగర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

లారీ డ్రైవర్..

హసన్‌పర్తి: అప్పుల బాధతో లారీ డ్రైవర్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈసంఘటన హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం నాగారంలో ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగారానికి చెందిన జి.శ్రీనివాస్(42) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శ్రీనివాస్‌కు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. అయితే కుటుంబపోషణ నిమిత్తం వివిధ వర్గాల నుంచి తీసుకున్న అప్పులు చెల్లించలేనని కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో ఆదివారం గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం మార్చురీకి తరలించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

మానవ ప్రమేయం లేకుండా ప్యాకింగ్


మ్యాప్స్ 6ఎస్2 మిషన్

మానవ ప్రమేయం లేకుండా అన్ని రకాల ప్యాకింగ్‌లను చేపట్టేందుకు మ్యాప్స్ 6ఎస్2 యంత్రం తోడ్పడుతుంది. మందులు, జంక్ ఫుడ్స్, వివిధ రకాల ఎలక్ట్రికల్ వస్తువులను ప్యాకింగ్ చేసేందుకు తోడ్పడుతుంది. స్వయంగా నాణ్యమైన వస్తువులను సేకరించడం, సరైన పద్ధతిలో ప్యాకింగ్ చేయడం మిషన్ ప్రత్యేకత. కంపెనీల్లో ఇలాంటి మిషన్స్‌పై పని చేసేందుకు విద్యార్థులకు శిక్షణ అందజేస్తున్నారు.

స్పాట్ వెల్డింగ్


కుకా రోబో

కార్ల కంపెనీల్లో స్పాట్ వెల్డింగ్ అనేది అత్యాధునిక టెక్నాలజీ. దీని కోసం నిట్‌లోని సీమెన్స్ సంస్థ కుకా రోబోను అందుబాటులోకి తీసుకొచ్చింది. స్పాట్ వెల్డింగ్, కార్ల తయారీలో వివిధ రకాల పరికరాలను అమర్చేందుకు, వెల్డింగ్‌కు ఇది తోడ్పడుతుంది.

ఏసీ తీసుకుని.. డీసీగా మార్చి..


అడ్వాన్స్‌డ్ యూపీఎస్

అడ్వాన్స్‌డ్ యూపీఎస్.. ఇది 60 కేవీ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఏసీ కరెంట్‌ను తీసుకుని డీసీ కరెంట్‌గా మార్చుకుని తిరిగి ఇన్వర్టర్లకు ఏసీ కరెంట్‌ను అందజేస్తుంది. ఇలాంటి అడ్వాన్స్‌డ్ యూపీఎస్‌లను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలో రెండు ఏర్పాటు చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణలో, ఆవిష్కరణలు చేపట్టే తరుణంలో విద్యుత్ అంతరాయం లేకుండా తోడ్పడుతున్నాయి.

ఆలోచనల ఆవిష్కరణ

- నిట్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ
- స్కిల్ డెవలప్‌మెంట్‌కు కేరాఫ్‌గా సీమెన్స్
- ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, స్టార్టప్స్‌కు అవకాశం
- మూడేళ్లలో 30వేల మందికి శిక్షణే లక్ష్యం


సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ భవనంలో నిట్ సీమెన్స్ సంస్థ

లక్ష్యం.. 30వేల మందికి శిక్షణ

రాబోవు మూడేండ్లలో 30వేల మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ అందించడమే లక్ష్యంగా నిట్–సీమెన్స్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. మార్చి నుంచి విద్యార్థులకు శిక్షణ ప్రారంభించనున్నారు. గత ఏడాది కిట్స్ కళాశాలలో 60 మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇచ్చారు.

అందుబాటులో 13 ల్యాబ్స్

- ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ)
- అడిటివ్ మ్యానూఫ్యాక్చరింగ్
- అడ్వాన్స్ మ్యానూఫ్యాక్చరింగ్
- ఆటోమేషన్
- సీఎన్‌సీ కంట్రోలర్
- సీఎన్‌సీ మిషీన్స్
- ఎలక్ట్రికల్ ఎనర్జీ అండ్ సేవింగ్స్
- మెకానికల్
- ప్రాసెస్ ఇన్స్ట్రుమెంటేషన్
- ప్రాడక్స్ డిజైన్ అండ్ వాలిడేషన్
- రోబోటిక్స్
- స్మార్ట్ ఫ్యాక్టరీ
- టెస్ట్ అండ్ ఆప్టిమైజేషన్

కాజీపేట అర్బన్: ఆలోచనలకు ఆవిష్కరణల రూపకల్పన చేపట్టేందుకు వేదికగా నిట్ వరంగల్‌లోని సెంటర్ ఫర్ ఎక్సలెన్సీ భవనంలో సీమెన్స్ సంస్థ ఏర్పాటు చేసింది. ఇంజనీరింగ్ విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, స్టార్టప్స్‌కు తమ ఆలోచనలకు అనుగుణంగా మిషనరీస్‌ను అందజేసేందుకు నిట్ వరంగల్, సీమెన్స్ సంస్థ 2020లో ఒప్పందం కుదుర్చుకున్నాయి. నిట్ వరంగల్ రూ.20 కోట్లు, సీమెన్స్ సంస్థ రూ.151 కోట్ల నిధులతో అత్యాధునిక యంత్రాలను సెంటర్ ఫర్ ఎక్సలెన్సీలో అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇంక్యూబేషన్ సెంటర్‌లా నూతన ఆవిష్కరణలకు, స్కిల్ డెవలప్‌మెంట్‌కు తోడ్పడుతున్న నిట్– సీమెన్స్ సంస్థపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

స్కిల్ డెవలప్‌మెంట్‌కు కేరాఫ్‌గా..

భారత ప్రభుత్వం ఆత్మ నిర్భర్‌భారత్, మేక్ ఇన్ ఇండియాకు నిదర్శనంగా సీమెన్స్ సంస్థ నిట్ నిలవనున్నాయి. ఇంజనీరింగ్ విద్యార్థులకు అన్ని రంగాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణను అందజేస్తూనే ఆధునిక యంత్రాలపై అవగాహన కల్పించనున్నారు. సీమెన్స్ స్కిల్ డెవలప్‌మెంట్ తన ప్రత్యేక ప్రోగ్రాం ల్యాంగ్వేజీ మైండ్ స్పియర్ ల్యాంగ్వేజీతో క్యాంపస్ సెలక్షన్స్‌కు తోడ్పడనుంది. దీంతో నూతన పరిశోధనలతో ఆవిష్కరణలు చేపట్టే అవకాశం ఉంటుంది.

నిట్ వరంగల్‌లో సీమెన్స్..

నిట్‌లోని సెంటర్ ఫర్ ఎక్సలెన్సీ భవనంలో ఏర్పాటు చేసిన నిట్, సీమెన్స్ సంస్థ మానవ ప్రమేయం లేకుండా అత్యాధునిక యంత్రాలతో, నాణ్యమైన పనులను చేపట్టేందుకు పని చేస్తుంది. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెడికల్, మెట్రో ట్రేయిన్ మోటార్స్, టెలీ కమ్యూనికేషన్స్ తదితర రంగాల్లో సీమెన్స్ ఉత్పత్తి చేస్తుంది. జర్మనీలో 1963లో ప్రారంభమైన సీమెన్స్ కంపెనీ భారతదేశానికి 1910లో రాగా నిట్ వరంగల్‌లో 2020లో అడుగుపెట్టింది.

నిట్‌కు ఆర్థిక వనరుగా సీమెన్స్

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్‌కు ఇంక్యూబేషన్ సెంటర్ లా ఇంజనీరింగ్ విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ అందించేందుకు సీమెన్స్ తోడ్పడుతుంది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు, స్టార్టప్స్‌కు సెంటర్‌ఫర్ ఎక్సలెన్సీ భవనంలో ఏర్పాటు చేసిన నిట్, సీమెన్స్ సంస్థలోని అత్యాధునిక పరికరాలను, శిక్షణకు, ఆవిష్కరణలకు సౌకర్యాన్ని కల్పించనున్నారు. దీంతో ఇప్పటికే నిట్ వరంగల్‌లోని సీఆర్ఐఎఫ్ ఆర్థిక వనరుగా తోడ్పడుతుండగా అదే కోవలోకి సీమెన్స్ రానుంది.

ఇంజనీరింగ్ విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్



ఇంజనీరింగ్ విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇచ్చేందుకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలో నిట్, సీమెన్స్ సంస్థ ఏర్పాటు చేయబడింది. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, స్టార్టప్స్ తమ ఆలోచనలకు అనుగుణంగా ఆవిష్కరణలు చేపట్టేందుకు అన్ని రకాల వసతులు, మిషన్స్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నాం.

– క్రిష్ణానంద్, చీఫ్ ఎగ్జిక్యూటివ్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ, నిట్ ప్రొఫెసర్

కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు


పరుగు పోటీలో పాల్గొన్న అభ్యర్థులు

వరంగల్ క్రైం : కాకతీయ యూనివర్సిటీలోని మైదానంలో పోలీస్ కానిస్టేబుల్, సబ్ ఇన్‌స్పెక్టర్ల నియామకాలకు దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం 1,184 మంది అభ్యర్థులకు ఈవెంట్ల హాల్ టికెట్లు జారీ చేయగా, 925 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో తుది పరీక్షలకు 435 మంది ఎంపికైనట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. కార్యక్రమంలో క్రైం డీసీపీ మురళీధర్, అదనపు డీసీపీలు సంజీవ్, సురేష్‌కుమార్‌లతో పాటు ఏసీపీలు, ఆర్ఐలు, ఇన్‌స్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ నోట్ల కలకలం!


రూ.100నకిలీ నోటు

కాళేశ్వరం: భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో నకిలీ నోట్లు కలకలం రేపుతున్నాయి. కాళేశ్వరం పుణ్యక్షేత్రంలో గోదావరి తీరం, గ్రామంలో కిరాణ, బెల్టు, మద్యం దుకాణాలు, చికెన్ సెంటర్లను నకిలీ నోట్లు సరఫరా చేసే వ్యక్తులు ఎంచుకుంటున్నట్లు సమాచారం. ఆదివారం గోదావరి తీరం వద్ద ఒకరికి రూ.100 నకిలీ నోటు భక్తుడు ఇవ్వడంతో అది నకిలీ అని తేల్చడంతో మరోటి ఇచ్చినట్లు తెలిసింది. ఇలా రూ.200, రూ.100 నకిలీ నోట్లు గత కొన్ని రోజులుగా చలామణి అవుతున్నట్లు తెలిసింది. అయితే నకిలీ నోట్ల చలామణిపై ఎవరూ స్పందించకపోవడతో వారు మరింత రెచ్చిపోయే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సంత్ సేవాలాల్ అవతార పురుషుడు

- బంజారాల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి దయాకర్‌రావు


మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు, వేదికపై వినయ్‌భాస్కర్, బంజారా సంఘాల ప్రతినిధులు

హన్మకొండ అర్బన్: అయోధ్యను ఏలిన శ్రీరాముడి మాదిరిగా మానవ రూపంలో పుట్టిన అవతార పురుషుడు సంత్‌సేవాలాల్ మహరాజ్ అని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం హన్మకొండ నిట్ సమీపంలోని ఓ ఫంక్షన్ హాలులో ఉమ్మడి జిల్లా బంజారా ఆత్మీయ సమ్మేళనం, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి దయాకర్‌రావు మాట్లాడారు. బంజారాలు కల్మశం లేని మనుషులని, వారు నమ్మితే ప్రాణాలు ఇస్తారని అన్నారు. తన 40ఏళ్ల రాజకీయ ప్రస్తానంలో బంజారాలది కీలపాత్ర అన్నారు. పాలకుర్తిలో బంజారాలు సేవాలాల్ విగ్రహం ఏర్పాటు చేస్తామంటే ఎకరం స్థలం, రెండు కోట్ల రూపాయలు కేటాయించామని దానికి ఈ నెల 26న ప్రారంభిస్తున్నమని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌లో రూ.100కోట్లతో సేవాలాల్ భవన్ నిర్మించామన్నారు. వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. నియోజక వర్గంలో బంజారాలకు సంబంధించి సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. బంజారాలతో తనకు విడదీయరాని బంధం ఉందన్నారు. కార్యక్రమంలో బంజారాల డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరించారు. వివిధ బంజారా సంఘాల ప్రతినిధులు మాజీ ఎంపీ సీతారాంనాయక్, పాడియ గాంగూనాయక్, పోరిక జవహర్‌లాల్, అజ్మీరా బోజానాయక్, చందూలాల్, పోరిక వీరన్న, గుగులోత్ వీరమ్మ, సత్యవతినాయక్, బానోత్ వెంకట్‌నాయక్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో భాగంగా బంజారా మహిళల సాంప్రదాయ నృత్యాలు కట్టుకున్నాయి.

ఆదివాసీలతో సమానంగా హక్కులు కల్పించాలి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

ఏటూరునాగారం: జిల్లాలోని నేతకానీ కులస్తులకు ఆదివాసీలతో సమానంగా ఏజెన్సీ హక్కు కల్పించాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నేతకానీ సంఘం రాష్ట్ర నాయకుడు దుర్గం రమణయ్య ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని నేతకానీ కులస్తులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏజెన్సీలోని నేతకానీలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని, ఆదివాసీలకు కల్పించిన హక్కులు, చట్టాలు నేతకానీలకు కల్పించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర వచ్చిన తర్వాతనే నేతకానీ కులస్తులను కేసీఆర్ ప్రభుత్వం గుర్తించిందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు ఒక్కతాటిపైకి రావాలన్నారు. మనకు ఉన్న హక్కులను కాపాడుకోవాలన్నారు. ఎస్సీల్లో 59 కులాలున్నాయని, వాటిలో నేతకాని కులస్తులు ఉన్న సంగతి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు మర్చిపోవద్దు అన్నారు. మొట్టమొదటిగా నేతకానికులం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై అసెంబ్లీలో అడుగుపెట్టానని, ప్రజలకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానన్నారు. అనేక మంది పేదవారికి సరైన వసతి, ఇళ్లు, మెరుగైన వైద్యం, చదువు అందడం లేదన్నారు. ఐక్యంగా ఉద్యమించి సత్తా చాటుదామని పిలుపునిచ్చారు. ఈ ప్రభుత్వంలోనే నేతకానీలకు సరైన న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్, జిల్లా అధ్యక్షుడు జాడి రాంబాబు, మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ కావిరి చిన్నికృష్ణ, చిన్న రాజయ్య, దీకొండ నర్సింగరావు, కాంతారావు, లక్ష్మీకాంత్, చంద్రబాబు, జాడి వెంకటేష్, మల్లేష్, చింతగూడెం సర్పంచ్ నారాయణ, దుర్గం రాజేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

- గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఘటన
- పాలకుర్తి మహాశివరాత్రి జాతరకు వెళ్లొస్తుండగా ప్రమాదం


వెంకన్న(ఫైల్)


అనిల్(ఫైల్)

పాలకుర్తి టౌన్: జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని నయార పెట్రోల్ బంకు వద్ద గుర్తు తెలియని వాహనం మోటార్ సైకిల్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఆదివారం తెల్లవారు జామున జరిగిన ఘటనకు సంబంధించి, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం దౌలత్‌నగర్ శివారు చెరువుకొమ్ముతండా గ్రామానికి చెందిన దారావత్ భద్రు కుమారుడు దారవత్ వెంకన్న(18), దారావత్ వీరన్న కుమారుడు అనిల్(18), దారావత్ రఘుపతి, మూనావత్ ప్రవీన్‌లు కలిసి రెండు మోటార్ సైకిళ్లపై శనివారం సాయంత్రం పాలకుర్తి మహాశిరాత్రి జాతర సందర్భగా శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకొని తిరిగి ఆదివారం తెల్లవారు జామున స్వగ్రామానికి మోటార్ సైకిళ్లపై బయల్దేరారు. ఈ క్రమంలో పాలకుర్తి శివారులోని నయార పెట్రోల్ బంకు వద్ద గుర్తు తెలియని వాహనం వీరు ప్రమాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన వెంకన్న, అనిల్‌ను వారి స్నేహితులు జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించి, ప్రథమ చికిత్స అందించారు. వైద్యుల సూచన మేరకు వరంగల్‌కు 108లో తరలిస్తుండగా మార్గం మధ్యలో అనిల్ మృతి చెందగా, వెంకన్న హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించగా, మృతుడు వెంకన్న తండ్రి భద్రు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విశ్వేశ్వర్, ఎస్సై తాళ్ల శ్రీకాంత్ తెలిపారు.


రోదిస్తున్న అనిల్ కుటుంబ సభ్యులు

శోకసంద్రంలో చెరువుకొమ్ముతండా

వరంగల్(పర్వతగిరి): మండలంలోని చెరువుకొమ్ముతండాకు చెందిన ఇద్దరు యువకులు ధరావత్ అనిల్, ధరావత్ వెంకన్నలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు తెలియడంతో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అనిల్ బీటెక్ మొదటి సంవత్సరం, వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో వెంకన్న బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. అనిల్ కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ములు ఉండగా అనిల్ రెండో వాడు. వెంకన్న కుటుంబంలో ఒక చెల్లి వెంకన్న ఉండగా వెంకన్న మృతితో కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. అయితే ఎలాంటి చెడు అలవాట్లకు బానిస కాకుండా తండాలో మంచి పేరు సంపాదించుకున్న అనిల్, వెంకన్నలు దైవదర్శనం కోసం వెళ్లి మృతి చెందడంతో తండాలో ప్రతీ ఒక్కరు విలపించారు. వీరిద్దరు ఎలాంటి మత్తు పదార్థాలు, మందు అలవాటు లేకపోగా.. చదువుకునే వారిని ప్రోత్సహించేవారని, తండాలో జరిగే ఏ కార్యక్రమాలకైనా ముందుండే వారని తండా వాసులు గుర్తు చేసుకుని తల్లడిల్లిపోయారు.

చోరీ కేసులో వ్యక్తి రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ

రఘునాథపల్లి: జల్సాలకు అలవాటుపడి దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు వారం రోజుల వ్యవధిలోనే అరెస్ట్ చేసి, నిందితుడి నుంచి రూ.1,35,625 సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ రఘుచందర్ తెలిపారు. జనగామ జిల్లా రఘునాథపల్లి మండల కేంద్రంలోని జనగామ రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో నిందితుడి అరెస్ట్ చూపి, వివరాలు వెల్లడించారు. మండలంలోని కోమళ్ల గ్రామానికి చెందిన వెల్పుగొండ అశోక్ తన తల్లి బుచ్చమ్మ కేన్సర్ వ్యాధితో బాధపడుతుండగా సికింద్రాబాద్ లాలాగూడ రైల్వే ఆస్పత్రిలో అడ్మిట్ చేసేందుకు ఇంటికి తాళం వేసి వెళ్లారు. తాళం వేసిన విషయాన్ని గుర్తించిన అదే గ్రామానికి చెందిన వెల్పుగొండ కృష్ణ ఇంట్లో చొరబడి బీరువాలో ఉన్న నగదుతోపాటు బంగారు, వెండి ఆభరణాలు అపహరించాడు.. ఈ నెల 10న ఆస్పత్రి నుంచి అశోక్ ఇంటికి చేరుకోగా దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు చేస్తూ మద్యం సేవిస్తున్న వారిపై నిఘా పెట్టారు. ఈ తరుణంలో వెల్పుగొండ కృష్ణ అదే పద్ధతిలో అతిగా మద్యం సేవిస్తూ జల్సాలు చేస్తున్న తీరుపై పోలీసులకు అనుమానం వచ్చి విచారణ చేయగా, తానే దొంగతనానికి పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. దీంతో ఆదివారం అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి రూ.68వేల నుంచి రూ.30వేలు, రూ.1,05,625 విలువ గల బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని, వాటిని కోర్టు ఆదేశాల మేరకు బాధితులకు అందజేస్తామని తెలిపారు. వారం రోజుల వ్యవధిలో దొంగతనం కేసును చాకచక్యంగా ఛేదించిన సీఐ సంతోష్, ఎస్సై వీరేందర్‌ను ఏసీపీ అభినందించారు. హెడ్‌కానిస్టేబుల్ బాస్కుల వెంకటయ్య, కానిస్టేబుల్ నవీన్‌రెడ్డి, కుమారస్వామి పాల్గొన్నారు.

ఎస్సీల అభివృద్ధికి రూ.38,700కోట్లు

- ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్


విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి ఈశ్వర్, పక్కన ఎమ్మెల్యే సతీష్ కుమార్

భీమదేవరపల్లి: ఎస్సీలను పారిశ్రామికవేత్తలుగా చూడాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమని అందుకుగానూ ఎస్సీల అభివృద్ధి కోసం రూ.38,700 కోట్ల నిధులను కేటాయించినట్లు ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని గట్లనర్సింగపూర్‌లో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి మంత్రి కొప్పుల ఆదివారం హాజరయ్యారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వాల వైఫల్యాలతో ఎస్సీలు నేటికీ ఆర్థికంగా అభివృద్ధి చెందలేదన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు అనంతరం ఎస్సీలను అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చాలనే లక్ష్యంతో కేసీఆర్ దళిత బంధు, గురుకుల పాఠశాలలు, విదేశీ విద్యకు రుణసాయం, దళిత రక్షణ నిధి లాంటి అనేక కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది ఎస్సీల అభివృద్ధి నిధికి రూ.21వేల కోట్లు, దళిత బంధుకు రూ.17,700కోట్లు కేటాయించినట్లు వివరించారు. హుజూరాబాద్ నియోజకవర్గంలోని 18వేల దళిత కుటుంబాలకు రూ.2వేల కోట్ల వ్యయంతో దళిత బంధు యూనిట్లు అందించామన్నారు. రాష్ట్రంలోని ప్రతి దళిత కుటుంబానికి దశల వారీగా దళిత బంధు పథకాన్ని అమలు చేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని వివరించారు. తెలంగాణలో అమలవుతున్న పథకాలు ఇతర రాష్ట్రాల్లో సైతం అమలు కోసం అక్కడి ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్, హనుమకొండ జెడ్పీ చైర్మన్ మారెపల్లి సుధీర్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, ఎంపీపీ జక్కుల అనిత, జెడ్పీటీసీ వంగ రవి ఉన్నారు.

హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరణ

- భార్యఫిర్యాదుతో వెలుగులోకి..
- వివరాలు వెల్లడించిన సీఐ రంజిత్‌రావు


నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

మహాముత్తారం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలోని కొర్లకుంట గ్రామానికి చెందిన బోద ధర్మయ్యను నెల క్రితం హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించిన నలుగురు వ్యక్తులను ఆదివారం అరెస్టు చేసినట్లు కాటారం సీఐ రంజిత్‌రావు ఆదివారం తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.

ధర్మయ్య మద్యానికి బానిసై జనవరి 18న కొర్లకుంట గ్రామ శివారులోని టేకుతోటలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తల్లి ఫిర్యాదుతో పోలీసులు కేసునమోదు చేసుకున్నారు. కొన్నిరోజుల తర్వాత ఆయన భార్య ధర్మయ్య ఆత్మహత్యపై అనుమానాలు ఉన్నాయని మరో ఫిర్యాదు చేయడంతో పోలీసులు పూర్తి విచారణ చేపట్టారు. ఈక్రమంలో వారి విచారణలో ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి. మద్యానికి బానిసైన ధర్మయ్య పాతకక్షలను దృష్టిలో పెట్టుకొని పొలం పనుల్లో నిమగ్నమైన గ్రామానికి చెందిన రాములు అతని భార్య రాజేశ్వరిపై గొడ్డలితో దాడి చేయడానికి వెళ్లాడు. గమనించిన రాములు దంపతులు మరో ఇద్దరితో కలిసి ధర్మయ్యను ఆయన మెడలోనే ఉన్న టవల్‌లో ఉరివేసి హత్యచేశారు. ఈనేపథ్యంలో ఎవరికీ అనుమానం రాకుండా సమీపంలోని టేకుతోటలో ఓ చెట్టుకు ధర్మయ్య మృతదేహాన్ని ఆయన లుంగీతోనే వేలాడదీసి ఆత్మహత్యగా చిత్రీకరించారు. అయితే ధర్మయ్య భార్య ఫిర్యాదుతో విచారణ చేపట్టిన పోలీసులు రాములు అతని భార్య రాజేశ్వరితో పాటు అతనికి సహకరించిన ఇద్దరు ఆత్మారి వెంకటి, రాజును అరెస్టు చేసినట్లు వెల్లడించారు. సీఐ వెంట మహాముత్తారం ఇన్‌చార్జ్ ఎస్సై సుధాకర్‌తో పాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.